క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల/కోరుట్లరూరల్/మెట్‌పల్లి: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, మెట్‌పల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, సింగిల్‌విండో చైర్మన్ ఆదిరెడ్డి, సీనియర్ నాయకులు చీటి వెంకట్రావు, కాశిరెడ్డి మోహన్ రెడ్డి, సజ్జు, సత్యం, ఫయాం, బీఆర్ఎస్ నాయకులుపాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం తొలగింపు సరికాదు



మాట్లాడుతున్న అంబేడ్కర్ సంఘ నాయకులు

కోరుట్ల: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని మున్సిపల్ ఆఫీస్ పక్కన గల తీన్‌రస్తా వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించాలనే ఆలోచన సరికాదని ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘ నాయకులు అన్నారు. పట్టణంలో మంగళవారం మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించటమంటే అన్ని వర్గాల ప్రజలను, ముఖ్యంగా దళితులను అవమానించటమే అవుతుందన్నారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసే ఆలోచనలను మానుకోవాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘ నాయకులు బలిజ రాజరెడ్డి, ఉయ్యాల నర్సయ్య, రాస భూమయ్య, ఉయ్యాల శోభన్, తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న టీపీవైఎస్ నాయకులు

జగిత్యాల: బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని టీపీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలో పొన్నాల గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 11 ఏళ్ల క్రితం మంచినీళ్ల బావి సమీపంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటుకు భూమిపూజ చేశారని, ఇప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో నక్క విజయ్, బొల్లి శేఖర్, సతీశ్, దీపక్, రాజ్‌కుమార్, బోనగిరి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్ర విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాల: ఏప్రిల్ 7న వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీరహనుమాన్ విజయయాత్రను విజయవంతం చేయాలని విశ్వహిందు పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు అన్నారు. మంగళవారం తహసీల్ చౌరస్తాలో హనుమాన్ ఆలయంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శోభాయాత్రలో హిందువులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో భారత్ సురక్ష సమితి నాయకులు గంగాధర్, సింగం గంగాధర్, పోచమల్లు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన బీసీ సంఘం నాయకులు

జగిత్యాల: రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన మహాగర్జనకు జగిత్యాల నుంచి బీసీ సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్య, ఉద్యోగ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి రాష్ట్ర కార్యదర్శి నర్సారెడ్డి, జలజ, రాజిరెడ్డి, జీవన్ తదితరులు తరలివెళ్లారు.

డిగ్రీ కళాశాలకు మోక్షం కలిగేనా..?

- సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో లేని కళాశాల
- ఏటా ఇంటర్ పూర్తి చేస్తున్న విద్యార్థులు 200 మందికి పైనే..
- రెండు మండలాలకు కలిపి కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్
- అధికారంలోకొస్తే మంజూరు చేయిస్తానని జీవన్‌రెడ్డి హామీ



బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

సారంగాపూర్: ఒకప్పుడు మావోయిస్టు ప్రభావిత గ్రామాలుగా ఉండి, మారుమూల మండలాలుగా ఉన్న సారంగాపూర్, బీర్‌పూర్‌లు నేడు అభివృద్ధిలో ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. ఈ రెండు మండలాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. ఆ రోజుల్లో పది వరకు చదివి ఆ తరువాత చదువులకు ఫుల్‌స్టాప్ పెట్టే పరిస్థితి. ఇక్కడి ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. మండలంలో విద్యావకాశాలు మెరుగు పరచడానికి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు కలిపి కనీసం ఒక డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు, యువజన సంఘాలు, విద్యార్థుల తల్లితండ్రులు, వివిధ పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీర్‌పూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తానని హామీ ఇవ్వడంతో, విద్యార్థుల్లో రానున్న రోజుల్లో డిగ్రీ కళాశాల ఏర్పాటు జరుగుతుందని రెండు మండలాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీ ఏడాది 200 మందికి పైగా విద్యార్థులు ఇంటర్ పూర్తి

సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతి సంవత్సరం 90 నుండి 110 మంది వరకు, బీర్‌పూర్ జూనియర్ కళాశాలలో 95 నుండి 120 మంది వరకు విద్యార్థులు ఇంటర్ పూర్తి చేస్తున్నారు.

40 శాతం మంది విద్యార్థులు ఇళ్లకే పరిమితం

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్ వరకు విద్య అందుతుండడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇంటర్ పూర్తి చేసి ఇళ్లకే పరిమితమవుతున్నారు. డిగ్రీ కళాశాల లేక, దూరం వెళ్లలేక ఇంటర్ పూర్తి చేసిన వారిలో 40 మంది విద్యార్థులకు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఎక్కువ మంది బాలికలతో చదువు మాన్పించి వారిని తల్లితండ్రులు వ్యవసాయ పనులకు, బీడీలు చుట్టడం, మిషన్‌లతో బట్టలు కుట్టడానికి పరిమితం చేస్తున్నారు. బాలురను సైతం వ్యవసాయ పనులు, ఇతర ఉపాధి పనుల్లోకి తీసుకెళుతున్నారు.

కళాశాల ఏర్పాటు చేస్తే విద్యార్థులకు మేలు

జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి సారంగాపూర్ 15 కిలోమీటర్ల దూరం ఉండగా, బీర్‌పూర్ మండల కేంద్రం 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసినా రెండు మండలాలకు అందుబాటులో ఉంటుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు కళాశాల మంజూరు చేయించాలని కోరుతున్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలి



డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే గ్రామాల్లో ప్రతి విద్యార్థి డిగ్రీ వరకు విద్యాభ్యాసం పూర్తి చేయగలుగుతాం. ప్రతి ఉద్యోగ పరీక్షకు డిగ్రీ తప్పనిసరి. పట్టణాలకు వెళ్లి చదవడం అందరికీ ఆర్థిక భారమవుతుంది.

– బి.అరవింద్, విద్యార్థి, రేచపల్లి

చదువు ఆపేస్తున్నారు



చాల మంది విద్యార్థులు సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాల్లో ఇంటర్ విద్య వరకు అవకాశం ఉండి, ఇంటర్ పూర్తి చేసి చదువులు ఆపివేస్తున్నారు. డిగ్రీ కళాశాల ఏర్పడితే డిగ్రీ వరకు చదువుకునే అవకాశం ఉంటది.

– పొలాస శివ, విద్యార్థి పెంబట్ల

బీర్‌పూర్‌లో ఏర్పాటుకు కృషి

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వస్తే బీర్‌పూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చాను.ఈ విషయంలో కొంత ఆలస్యం జరిగింది. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో సారంగాపూర్, బీర్‌పూర్‌లో రెండు కళాశాలలు ఏర్పాటు చేయించాం. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తాం.

– జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి

తాగునీటి సమస్య రానీయొద్దు

- మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



ఆలయంలో పూజలు చేస్తున్న జీవన్‌రెడ్డి

సారంగాపూర్: వేసవి తీవ్రత రోజు రోజుకు పెరుగుతుందని గ్రామాల్లో తాగునీటి సమస్య, ఇతర అవసరాల కోసం నీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రేచపల్లిలో పర్యటించి అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో తాగునీటి సరఫరాహెలా ఉందని ప్రశ్నించారు. గ్రామస్తులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురావడంతో అధికారులతో మాట్లాడారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోండ్ర రాంచంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎండీ. ఇబ్రహీం, గౌరిశెట్టి రాజన్న, బొడిగం తిరుపతిరెడ్డి, ఆసాది రాజన్న, మేడిపల్లి ఆనందరెడ్డి, హరీష్ తదితరులు ఉన్నారు.

గీత కార్మికుని కుటుంబాన్ని ఆదుకుంటాం

జగిత్యాలరూరల్: గీత కార్మికుని కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన దాసరి లచ్చయ్యగౌడ్ ఇటీవల ఈత చెట్టు పైనుంచి పడి మృతిచెందగా, ఆయన కుటుంబాన్ని జీవన్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి ప్రభుత్వ పరిహారం అందేలా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట నాయకులు దశరథరెడ్డి, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇంటి వద్దకే భద్రాద్రి రాముని తలంబ్రాలు

కోరుట్ల: భద్రాద్రి రాముని కల్యాణ తలంబ్రాలను టీఎస్ ఆర్టీసీ కార్గో ద్వారా ఇంటికి చేర్చుతున్నామని కోరుట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.151 ఆన్‌లైన్ లేదా కోరుట్ల ఆర్టీసీ బస్టాండ్ కౌంటర్లో చెల్లిస్తే సీతారాముల కల్యాణ తలంబ్రాలు, రెండు ముత్యాలను నేరుగా తమ అడ్రస్‌కే చేరవేస్తామన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9154298572 లో సంప్రదించవచ్చని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

అనాథ పిల్లలకు సాయం

వెల్గటూర్/ధర్మపురి: ఎండపల్లి మండలం మారేడ్‌పల్లి గ్రామానికి చెందిన బిటుకు తిరుపతి అనే వికలాంగ యువకుడు అనారోగ్యంతో మృతి చెందాడు. వారి ఇద్దరు పిల్లలు వర్షిత, అశ్విత్‌లు అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఇద్దరు పిల్లల చదువుకు హామీ ఇచ్చినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి తెలిపారు. రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు.

ధర్మపురి మండలంలోని నక్కలపేట గ్రామానికి చెందిన అనాథ పిల్లలు రాజేశ్, శరత్‌లకు మంగళవారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం రూ.21 వేలు అందించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ దినేశ్, వేముల రాజు, రాజేశ్ పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం

జగిత్యాల: శ్రీరామ నవమిని పురస్కరించుకుని వెల్దుర్తిలో నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని గొల్లపల్లి హనుమాన్ భక్తబృందం సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేశారు.

వృద్ధాశ్రమానికి విరాళం

జగిత్యాలఅగ్రికల్చర్: సమాజ సేవలోనూ విద్యుత్ ఉద్యోగులు ముందుంటారని జిల్లా ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శాలియా నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి అనాథ వృద్ధాశ్రమానికి విద్యుత్ ఉద్యోగులు మంగళవారం రూ.20 వేలు ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. ఉద్యోగులు ప్రతీ నెల తమకు చేతనైన సాయం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, విద్యుత్‌సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ధర్మపురి: ధర్మపురికి చెందిన సంకు భూలక్ష్మి (55) అనే మహిళ ఇళ్లల్లో పనులు చేసుకుంటూ బతుకుతోంది. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన మహిళ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, చుట్టాలు,బంధువులకు సమాచారం అందించారు. అయినా ఆమె ఆచూకీ తెలియక పోవడంతో ఆమె కూతురు భూదారపు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మకం



సీఎం రేవంత్,మంత్రి ఉత్తమ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల రూరల్/మెట్‌పల్లి: రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డులు ఉన్న నిరుపేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేయాలనే ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు,కొమిరెడ్డి కరం అన్నారు. మండలంలోని యూసుఫ్‌నగర్, చిన్నమెట్‌పల్లిలో, మెట్‌పల్లి పట్టణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ కార్డులో ఉన్న ప్రతీ ఒక్కరికీ 6 కిలోల చొప్పున ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తుందన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి,మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొంతం రాజం, సత్యనారాయణ,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్:మండలంలోని గుండంపల్లిలో జువ్వాడి కృష్ణారావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడుపుల పుష్పలతతో కలిసి సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సయ్య, మామిడి లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవాలి

జగిత్యాలరూరల్/రాయికల్/సారంగాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి, రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్, సారంగాపూర్ ఎంపీడీవో చౌడారపు గంగాధర్ కోరారు.ఎస్సీ, బీసీ, మైనార్టీ,ఈబీసీలకు చెందిన నిరుద్యోగ యువత మీసేవ ద్వారా ఈనెల 14 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

కోరుట్ల: రాజీవ్ యువ వికాసం పథకానికి ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, ఎంపీడీవో ఓదెల రామకృష్ణా మంగళవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు.ఈ నెల 14 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

మెట్‌పల్లిరూరల్/కథలాపూర్: రాజీవ్ యువ వికాసం పథకానికి యువత దరఖాస్తు చేసుకోవాలని మెట్‌పల్లి ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి,కథలాపూర్ ఎంపీడీవో శంకర్ అన్నారు.ఆసక్తిగల వారు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసి పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో సమర్పించాలని పేర్కొన్నారు.

విద్యార్థి నాయకుల అరెస్ట్

జగిత్యాలక్రైం: హైదరాబాద్‌లోని హెచ్‌సీయూకు చెందిన భూముల విక్రయానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా, విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. మంగళవారం జగిత్యాల జిల్లా నుంచి యూనివర్సిటీకి నిరసన వ్యక్తం చేసేందుకు వెళ్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు ఎండీ.చౌదరి, పుప్పాల శ్రీకాంత్, సీపీఐఎం నాయకులు బొల్లారపు వినోద్, బచ్చం వినోద్‌లను పట్టణ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి వ్యక్తిగత పూచికత్తుపై వదిలిపెట్టారు.

ప్రతిష్ఠాపన ఉత్సవాలకు మల్లన్న స్వామి ముస్తాబు



ముస్తాబైన శ్రీమల్లికార్జున స్వామి ఆలయం

మల్లాపూర్: మండలంలోని రాఘవపేటలో శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ మేడాలమ్మ, కేతమ్మ సహిత శ్రీ మల్లికార్జున స్వామి, నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం ముస్తాబైంది. ఈ ప్రతిష్ఠాపన ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. 2న ఉదయం విగ్రహాల ఊరేగింపు, సాయంత్రం 4గంటలకు స్వస్తి ప్రత్యేక పూజలు 3,4న హోమాలు, అభిషేకాలు, మహా అన్నదానం ఉంటుందని శ్రీ కృష్ణయాదవ సంఘం సభ్యులు తెలిపారు.



కథలాపూర్: మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు ప్రమాదకరంగా మారాయి. వైర్లను సైతం పిచ్చిమొక్కలు అల్లుకుపోయాయి. విద్యార్థులు అటువైపు వెళ్లితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ట్రాన్స్‌కో అధికారులు చొరవ చూపి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చిమొక్కలు తొలగించి చదును చేయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: నవీన్
ట్రాన్స్‌కో ఏఈ,కథలాపూర్, సెల్‌ఫోన్ నంబర్: 9440811478

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643



మల్లాపూర్: మండలంలోని గుండంపల్లి శివారులో శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ఆలయంలో మంగళవారం శ్రీ లక్ష్మీ–వెంకటేశ్వర స్వామి కల్యాణం అర్చకులు ప్రవీణ్‌కుమారచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, ట్రాన్స్‌కో ఏడీఈ మనోహర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడుపుల పుష్పలత, వివిధ పార్టీల నాయకులు,గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ విప్ జన్మదిన వేడుకలు



పెగడపల్లిలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెగడపల్లి/ధర్మపురి/బుగ్గారం/వెల్గటూర్: ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పెగడపల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములు గౌడ్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ధర్మపురి నంది కూడలి వద్ద, వెల్గటూర్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. బుగ్గారంలో మండల అధ్యక్షుడు వేముల సుభాష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో యాదవులకు రిజర్వేషన్ కల్పించాలి



సభ్యత్వాలు ఇస్తున్న మల్లేశ్‌యాదవ్

కథలాపూర్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు రిజర్వేషన్ కల్పించేలా ప్రభుత్వం, రాజకీయ పార్టీలు చొరవ చూపాలని యాదవసంఘం జిల్లా అడహక్ కమిటీ అధ్యక్షుడు గానవేని మల్లేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు. కథలాపూర్ మండలం కలిగోటలో మంగళవారం యాదవ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులంతా చైతన్యమై హక్కుల సాధనకు ఉద్యమించాలన్నారు. గ్రామంలో 56 మంది సభ్యత్వ నమోదు చేయించుకున్నారన్నారు. కార్యక్రమంలో మండల బాధ్యులు మ్యాదరవేని రామాంజనేయులు, రాచర్ల రవి, కల్లూరి రమేశ్, మార్కం రాజేశం, గంగుల రాజేందర్, మల్లేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో ముద్రించాలి

మల్యాల: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయబోయే రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటో ముద్రించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం అన్నారు. ఆహార భద్రత చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి పదివేల కోట్లు మంజూరు చేస్తే, అది రాష్ట్ర ప్రభుత్వం గొప్పతనంగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. గరీబ్ కల్యాణ్ యోజన కింది రాష్ట్రంలోని 3 కోట్ల మందికి ఒక్కొక్కరికి 6 కిలోల బియ్యం కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందన్నారు.

మిషన్ భగీరథ లీకేజీలకు మరమ్మతు

బుగ్గారం: మండల కేంద్రంలో ప్రధాన రహదారి వెంట మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు పలుచోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో నీటి సరఫరా జరిగినప్పుడల్లా తాగునీరంతా పెద్ద ఎత్తున లీకై స్థానిక మురుగుకాల్వల్లో కలుస్తోంది. దీనిపై గ్రామస్తులు ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు స్పందించిన స్థానిక పంచాయతీ అధికారులు మంగళవారం లీకేజీలకు మరమ్మతులు మొదలుపెట్టారు. గత కొన్ని రోజులుగా నీటి సరఫరా జరగకపోవడం, ఎండవేడికి పైపులైన్లలో లీకేజీలు ఏర్పడ్డాయని పంచాయతీ కార్యదర్శి అక్బర్ తెలిపారు. లీకేజీలన్నింటికీ మరమ్మతులు చేస్తున్నామన్నారు.